సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 8 | జనవరి | 2023



నిత్యాన్నదానానికి విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన సంకు సత్య వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు రూ.50,001 విరాళంగా అందించారు.



రత్నగిరికి సంక్రాంతులు

రత్నగిరికి అధునాతన వెలుగులు ప్రసరించను న్నాయి. స్వామివారి ఆలయంలో ఆధునిక విద్యుత్ పరికరాలు, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌తో విద్యుత్తు సరఫరా జరగనుంది.

డెల్టాలకు నీరు



రాజమహేంద్రవరం రూరల్: కాటన్ బ్యారేజ్ నుంచి శని వారం డెల్టా కాలువ లకు 9,170 క్యూసె క్కులు విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 2,650, మధ్యడెల్టాకు 1,920, పశ్చిమడెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

సంక్రాంతికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

రావులపాలెం: సంక్రాంతి పండగ సందర్భంగా ఈ నెల పదో తేదీ నుంచి ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు రావులపాలెం డిపో మేనేజర్ కేడీ ఎంఎస్ కుమార్ శనివారం తెలిపారు. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణంలో టిక్కెట్‌పై పది శాతం రాయితీ ఇస్తామన్నారు. వృద్ధులకైతే 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. పదో తేదీ నుంచి విశాఖపట్నం, విజయవాడ, సాలూరు, పార్వతీపురం, హైదరాబాద్ నుంచి సర్వీసులు నడుస్తాయన్నారు. 16 తేదీ నుంచి హైదరాబాద్‌కు, వివిధ ప్రాంతాలకు సర్వీసులు నడుపుతామన్నారు.

ఎమ్మెల్యే అశోక్ దీక్షకు మద్దతు ఇద్దాం : ఎమ్మెల్సీ తోట



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

యానాం: నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సీఎం రంగసామి ఇచ్చిన 15 హామీలను నెరవేర్చాలని కోరుతూ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు పార్టీలకు అతీతంగా మద్దతునివ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. రెండో రోజు శనివారం యానాంలో అశోక్ నిరాహార దీక్షా శిబిరానికి ఆయన వచ్చి మాట్లాడారు. ఒక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పరిష్కరించాలని దీక్షకు దిగితే వాటిని పరిష్కరించకుండా పుదుచ్చేరి ప్రభుత్వం జాప్యం చేయడం అన్యాయమన్నారు. ఈ ఉద్యమంలో ఎమ్మెల్యే ఆరోగ్యానికి సంబంధించి పొరపాటు ఏమైనా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. డిమాండ్లలో ప్రధానమైన ప్రజారోగ్యం, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇళ్లపట్టాల పంపిణీ, డంపింగ్ యార్డు తరలింపు తదితర సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు. ఈ దీక్షకు వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో భజనలు చేస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుడి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. వీరంతా స్వామివారి వ్రతాలు ఆచరించారు. ఆలయ ప్రాంగణంలో భజనలు చేశారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

రూ. 7.41 లక్షల సరకు జప్తు

కాకినాడ సిటీ: పీడీఎస్ బియ్యం నిల్వ, రవాణా చేస్తున్న 10 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి రూ.7.41 లక్షల విలువైన సరకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహన యజమానికి రూ. 23 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

సంప్రదాయానందలహరి

- పల్లెను తాకిన సంక్రాంతి సందడి
- హరిదాసు కీర్తనలు.. బసవన్నల విన్యాసాలు
- ఆకర్షిస్తున్న రంగురంగుల ఎడ్లబండ్లు
- రోజులు మారుతున్నా చెదరని సంస్కృతి



SUNDAY SPECIAL

సాక్షి అమలాపురం: భోగి మంటలు.. కోడిపందేలు.. బసవన్నల విన్యాసాలు.. సంక్రాంతి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఇవే. కాలం మారుతున్నా.. వేషభాషలు.. ఆహారపు అలవాట్లలో ఎన్ని మార్పులు చోటు చేసుకుంటున్నా అచ్చ తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే ఈ పెద్ద పండగ సంప్రదాయాల్లో మాత్రం ఎటువంటి మార్పులూ చోటు చేసుకోలేదు. డిసెంబర్ చివరి వారం నుంచే గంగిరెద్దుల వారు.. హరిదాసుల సందడి.. పండగ మూడు రోజులూ మెరిసే ఎద్దులు.. కొత్త రంగులతో మెరిసిపోయే ఎడ్ల బండ్లు.. పచ్చని కొబ్బరి తెరచాపలతో గూడెడ్ల బండ్లు.. ఇలా చెప్పుకొంటూ పోతే మన జిల్లాలో సంప్రదాయ సంక్రాంతి సంగతులెన్నో..

వీధుల్లో హరిదాసు కీర్తనలు



సంక్రాంతి వేళ హరిదాసుల సందడి కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. పట్టు ధోవతి.. పంచెకట్టు.. పట్టు కండువా నడుముకు చుట్టి.. కాలికి గజ్జెలు, మెడలో పూలహారం.. శిరస్సున అక్షయ పాత్ర ధరించి.. నుదుట చక్కగా తిలకం దిద్ది ముస్తాబైన హరిదాసులు.. ప్రజల నుంచి దానధర్మాలు అందుకొని.. వారికి ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవిస్తారు. నెల రోజుల పాటు వీధివీధినా వీరు హరిలొరంగహరి అంటూ గానం చేసి, చివరి రోజున స్వయంపాకంగా అందరూ ఇచ్చే ధన, ధాన్య, వస్తు దానాలు స్వీకరిస్తారు. వేకువన ఇల్లు విడిచింది మొదలు తిరిగి వెళ్లే వరకూ హరినామ సంకీర్తన తప్ప వారు మరేమీ మాట్లాడరు. అక్షయపాత్ర దించరు. కాలంతో పాటు హరిదాసుల్లోనూ మార్పు వచ్చింది. వాహనాల మీద తిరుగుతూ, రికార్డు చేయించిన హరినామ కీర్తనలను మైక్ ద్వారా ప్రజలకు వినిపించడం ఇప్పుడు నయా ట్రెండ్. ఆదరణ తగ్గుతున్నా.. మెరుగైన జీవనం పొందలేకున్నా.. ఈ వృత్తిని వదులుకోలేక కాలం వెళ్లదీస్తున్నారు.

గోమాతకు ముస్తాబు

గోవులు, ఎద్దులు అన్నదాత జీవితంతో పెనవేసుకుపోయి ఉంటాయి. ఇంట పసిడి పాడికుండ.. తోటలో సాగుకు అవసరమైన పెంట.. పండిన పంటలను పొలం నుంచి ఇళ్లకు చేరేందుకు ఎడ్ల బండ్లు. పొలం దున్నేందుకు ఎద్దులు.. ఇలా చెప్పుకుంటూ పోతే రైతు జీవనం గోమాతతోనే సాగుతుంది. రైతు పండగ సంక్రాంతిలో వీటిది ప్రత్యేక స్థానం. పండగ సందర్భంగా గోవులకు, ఎద్దులకు ప్రత్యేక అలంకరణ చేస్తారు. మెడలో చిరుగంటలు, పెద్దగంట, మువ్వలు, కొమ్ములకు ఝుంకీలు, ప్లాస్టిక్ తాళ్లు, మైసూరు ఎద్దుల కొమ్ములకు ఇత్తడి మువ్వలు.. చర్మంతో నడుం పట్టీ ఏర్పాటు చేస్తారు. పూర్తి అలంకరణ తరువాత కాషాయ, పచ్చ రిబ్బన్‌తో అలంకరిస్తారు. దిష్టి తగలదనే నమ్మకంతో కాళ్లకు తల వెంట్రుకలతో పేనిన తాళ్లు కడుతుంటారు. ముక్కుతాళ్లు కూడా కొత్తవి వేస్తారు. కొత్తదైన నక్కపల్లి కర్రతో కొత్త కొరడా కొనుగోలు చేస్తారు. దానికి పూల కుచ్చులు పెట్టి.. గుర్రపు తోలుతో చేసే కొరడాను చివర ఉంచుతారు.

ఎడ్ల బండి.. దర్జా వేరులేండి

కనుమ నాటికి ఎడ్ల బండ్లను కూడా రంగులతో అలంకరిస్తారు. వీటికి సున్నాలు రాయడంతో పాటు మొకులకు, చక్రాలకు అనుబంధంగా ఉండే ఇనుప కమ్మీకి గ్రీజు పెడతారు. బండి ముందు భాగంలో వెదురు గెడలు కట్టి.. వాటికి కొబ్బరి పీచు తాడుతో బిడులు వేస్తారు. కొందరు జమీందార్లు టేకు, మద్దితో బండ్లు తయారు చేయిస్తారు. గెడలు కట్టి డొక్కతాడుతో బిడులు వేస్తారు. కనుమ రోజున అలంకరించిన ఎద్దుల బండ్లపై దర్జాగా ఊరేగుతారు. ఎడ్లబండ్లకు కొబ్బరి ఆకులతో నేసిన చాపలను గూడుగా కట్టి కుటుంబ సమేతంగా ప్రభల తీర్థాలకు వెళ్లడం మరి కొంతమందికి ఆనవాయితీ.

నేలను తాకిన ఇంద్ర ధనస్సులా..

సంక్రాంతి సందడి అటు పల్లెలు, ఇటు పట్టణాల్లోనూ ఇప్పటికే కనిపిస్తోంది. పేడ కళ్లాపులు జల్లి... ముగ్గులతో ముస్తాబవుతున్న వీధులు.. రోడ్లు చూస్తుంటే నింగిన కనిపించే ఇంద్ర ధనస్సులు నేలను తాకినట్టు అనిపిస్తున్నాయి. అల్లిబిల్లి అల్లికలతో సాగే ముగ్గులకు.. రంగులతో అదనపు అందాలను అద్దుతున్న మగువలతో వీధులన్నీ కళకళలాడుతున్నాయి.

డూడూ బసవన్నా..

"మహారాజరాజశ్రీ మహనీయులందరికీ వందనాలు.. వంద వందనాలు... హరిహరులను సేవించే ఈ దాసులాడేటి తందనాలు.. తకిట తందనాలు.." అంటూ సూత్రధారులు సినిమాలో పాట గుర్తుండే ఉంటుంది. ఈ పాట గంగిరెద్దుల వారి జీవన విధానాన్ని ఆవిష్కరించింది. అప్పట్లో ఈ పాటకే కాదు.. దీనికి ఆధారమైన గంగిరెద్దుల వారికీ మంచి గుర్తింపు వచ్చింది. పెద్ద పండగ సంక్రాంతి అంటే ముందుగా గుర్తుకు వచ్చేది గంగిరెద్దుల వారే. గంగిరెద్దులను ముస్తాబు చేసి.. చేత సన్నాయి.. మేళంతో ఊరూరా.. ఇంటింటా తిరిగే గంగిరెద్దుల వారికి పండగ సమయంలో మంచి ఆదరణ ఉంటుంది. గంగిరెద్దును సింహాద్రి అప్పన్నగా భావించి పూజలు చేస్తారు. గంగిరెద్దుకు కొత్త వస్త్రాలు ఇవ్వడంతో పాటు వారికి బియ్యం, బెల్లం ముక్కలు, కూరగాయలు, పప్పుల వంటి నిత్యావసర వస్తువులు అందజేస్తారు. గంగిరెద్దుతో విన్యాసాలు చేయిస్తారు. ప్రాంతీయ బాణీల్లో జానపద పాటలు పాడుతారు. ఎక్కువగా డూడూ బసవన్నా ఇటు రారా బసవన్నా... ఉరుకుతూ రారన్నా రారన్న బసవన్నా... అమ్మగారికీ దండం పెట్టు.. అయ్యగారికీ దండం పెట్టు.. మునసబు గారికి దండం బెట్టూ... కరణం గారికి దండం బెట్టూ.. రారా బసవన్నా, రారా బసవన్నా" అంటూ పాడే పాట పాపులర్ అయ్యింది.



ఆకట్టుకుంటున్న గూడు ఎడ్లబండి

శిక్షణ ఇచ్చి.. ప్రదర్శనకు..



రైతులు, ఊరి పెద్దలు అచ్చువేసి వదిలేసిన పొగరబోతు గిత్తలకు రెండు నెలల పాటు జంగారెడ్డిగూడెంలో శిక్షణ ఇప్పిస్తాం. మా సింగరాయపాలెంలో 18 వరకూ గంగిరెద్దుల ప్రదర్శన చేసేవాళ్లు ఉన్నారు. ఆరుగురు చొప్పున మూడు బృందాలుగా పండగ ముందు ప్రదర్శనకు వెళతాం. ఈ సీజన్‌లో ఒక్కొక్కరికీ రూ.పది వేలు వస్తోంది.

– బొడ్డు సూరిబాబు, గంగిరెద్దుల విన్యాస కళాకారుడు, సింగరాయపాలెం, ఉప్పలగుప్తం మండలం

సంప్రదాయంలో భాగం



మా రైతులకు చేదోడు వాదోడుగా ఉండే ఎద్దులు.. ఆవులు మాకు దేవతలతో సమానం. ఎడ్ల బండ్లను పల్లకిగా భావిస్తాం. అందుకే సంక్రాంతి పండగ నాడు వాటిని అందంగా అలంకరిస్తాం. ఎడ్లను ముస్తాబు చేస్తాం. ఇది మన సంప్రదాయంలో భాగం. 50 ఏళ్లుగా క్రమం తప్పకుండా ఎడ్ల బండ్లపై తీర్థాలకు వెళ్తున్నాం.

– మాతా శ్రీరాములు, గంగలకుర్రు, అంబాజీపేట మండలం

గాంధేయవాది పొన్నాడ స్ఫూర్తిదాయకుడు



హనుమంతరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజోలు: సీనియర్ న్యాయవాది, గాంధేయవాది పొన్నాడ హనుమంతరావు స్ఫూర్తిదాయకుడని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం రాజోలులో హనుమంతరావు భౌతికకాయం వద్ద మంత్రి వేణు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. న్యాయవాదిగా, రచయితగా, రాజకీయ నాయకుడిగా పొన్నాడ అందించిన సేవలు ఎనలేనివన్నారు. పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కాంగ్రెస్ పార్టీ జెండాను హనుమంతరావు భౌతికకాయంపై ఉంచి నివాళులర్పించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, మానేపల్లి అయ్యాజీ వేమా, పాముల రాజేశ్వరీదేవి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, కాంగ్రెస్ నాయకులు కూనపరెడ్డి కృష్ణ, అల్లూరు మధుబాబు తదితరులు నివాళులర్పించారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరణీప్రగడ శ్రీనివాస్, నీతిపూడి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు సంతాపం తెలిపారు.

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా..

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం



భక్తులతో పోటెత్తిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం: శ్రీనివాసా.. వేంకటేశా నామస్మరణతో కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రం శోభిల్లింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. సుప్రభాత సేవకు బదులు స్వామివారికి తీర్థ బిందెలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరుప్పావై ప్రవచనాలు తదితర పూజలు జరిగాయి. స్వామివారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఆలయ అవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పెన్మెత్స సురేష్‌రాజు, మన్యం భాను, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. శనివారం ఒక్కరోజే ఆలయానికి రూ.13,42,132 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామివారికి వశిష్ఠ, గౌతమీ గోదావరి నుంచి తీర్థ బిందెలతో జలాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆత్రేయపురంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది.

కళర్‌ఫుల్‌గా..

- అమలాపురంలో 22న జాతీయ చిత్రకళా ప్రదర్శన
- కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహణ



కర్ణాటక రాష్ట్రం గుల్‌బర్గాకు చెందిన చిత్రకారిణి బి.శ్రీదేవి గీసిన నంది చిత్రం

అమలాపురం టౌన్: ఓ చిత్రం వేల భావాలను వ్యక్తీకరిస్తుంది. కుంచె అనేక చిత్రాలను మలుస్తుంది. చిత్రకళా పోటీలంటే కళాకారుడి కుంచె కదం తొక్కుతుంది. అతని ఆలోచనలు సృజనాత్మక, సందేశాత్మక చిత్రాలుగా మారతాయి. అలాంటి కళకు అమలాపురం కోనసీమ చిత్రకళా పరిషత్ వేదికగా మారింది. ఈ సంస్థ 33 ఏళ్లుగా జాతీయ చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల చిత్రకారులను సమైక్యం చేస్తోంది. కరోనా కారణంగా మూడేళ్ల తర్వాత ఈ నెల 22న స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో కోనసీమ చిత్రకళా పరిషత్ 33వ జాతీయ చిత్రకళా ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఇప్పటికే జాతీయ చిత్రకళా పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసింది. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అనేకమంది చిత్రకారులు తమ చిత్రాలను పంపించారు. ఖతార్ దేశంలో స్థిరపడిన తెలుగు చిత్రకారుడు చిట్టి రవికుమార్ మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ ఓ చిత్రాన్ని గీసి పోటీలకు నేను సైతం అంటూ పంపించారు. పోటీలకు దేశవ్యాప్తంగా మొత్తం 308 మంది తమ చిత్రాలను పంపారు. ప్రస్తుత 33వ జాతీయ చిత్రకళా ప్రదర్శన వేదికపైనే కరోనాతో ఆగిన 31, 32వ చిత్రకళా ఉత్సవాలను నిర్వహించనున్నారు. అంతర్జాతీయ చిత్రకారుడు డాక్టర్ ఉదయ్ కుమార్ మర్లపూడి, చిత్రకారుడు, విమర్శకుడు మాకినీడి సూర్యభాస్కర్, చిత్రకళా విశ్లేషకుడు పీవీ నారాయణాచార్యులు, ప్రముఖ చిత్రకారుడు టేకి మృత్యుంజయరావుతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 50 మంది చిత్రకారులు ఈ జాతీయ చిత్ర ప్రదర్శనకు వస్తున్నారు. పోటీలో గెలిచిన 66 చిత్రాలతో పాటు దేశంలోని ప్రముఖ చిత్రకారులు గీసిన చిత్రాలు ఇక్కడ ప్రదర్శిస్తారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవాన్ని ఆ రోజు అదే వేదికపై ఉంటుంది. 308 చిత్రకారుల్లో విజేతలుగా నిలిచిన 66 మందిలో పది మందికి భారత చిత్రకళా రత్న అవార్డులతో పాటు రూ.5 వేల నగదు బహుమతులు ఇస్తారు. పది మందికి ఆర్ట్ లెజెండ్ అవార్డులు ప్రదానం చేస్తారు. మరో పది మందికి చిత్రకళా రత్న అవార్డులు ఇస్తారు. మిగతా చిత్రకారులకు ఒక్కో ప్రముఖ చిత్రకారుడి పేరిట అవార్డులు ప్రదానం చేస్తారు. 22న జరిగే జాతీయ చిత్రకళా ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవ సభకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ హాజరవుతారు.



ఏలూరుకు చెందిన శ్రీనివాస పతంగి గీసిన యాపిల్ పండ్లు

చిత్రకళా వైభవాన్ని కాపాడేందుకే..



చిత్రకారుడినైన నేను 33 ఏళ్ల కిందట కోనసీమ చిత్రకళా పరిషత్‌ను స్థాపించాను. చిత్రకళకు వైభవం శాశ్వతంగా ఉండాలన్న తపనతోనే ఈ పరిషత్‌ను నెలకొల్పాను. జాతీయ చిత్రకళా పోటీల ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాల చిత్రకారులను భాషలకు అతీతంగా ఏకం చేయాలనుకున్న నా ప్రయత్నం ఫలించింది. నా ప్రాణం ఉన్నంత వరకూ చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహిస్తాను.

– కురసాల సీతారామస్వామి, వ్యవస్థాపక అధ్యక్షుడు, కోనసీమ చిత్రకళా పరిషత్, అమలాపురం



పందెం కోళ్లు... అమలాపురం రూరల్ ఇందుపల్లి చిత్రకారుడు రవిశాస్త్రి గీసిన చిత్రం

క్లుప్తంగా

కుప్పం వెళ్లొద్దు బాబూ..

మంత్రి దాడిశెట్టి రాజా



మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: సంక్రాంతి పండగ ప్రశాంతంగా జరుపుకోవాలంటే చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి రాకూడదని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం తుని పట్టణంలో జరిగిన సంక్రాంతి సంబరాలకు హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కడి ప్రజలు పంటలు పండి సంతోషంగా ఉన్నారని, ప్రచారం కోసం చంద్రబాబు పర్యటనకు వస్తున్నారంటే భయపడుతున్నారన్నారు. కందుకూరు, గుంటూరు జిల్లాల్లో జరిగిన చంద్రబాబు రోడ్ షో 11 మంది అమాయకుల ప్రాణాలను బలిగొందన్నారు. కుప్పం పర్యటనకు వస్తే ప్రశాంతత ఉండదని ప్రజలు భయపడుతున్నారన్నారు. ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు వ్యవహరించాలని హితవుపలికారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రజలంతా ఆనందంగా పండగ జరుపుకొనేందుకు సమాయత్తం అవుతున్నారని, టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా విద్వేషాలను సృష్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు.

పేకాట శిబిరంపై దాడి

ఐ.పోలవరం: పశువుల్లంక శివారు గోదావరి తిప్పపై పేకాటాడుతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై ఎస్.రాజేష్ సిబ్బందితో కలసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, రూ.2.87 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రత్నగిరికి సంక్రాంతులు



స్వర్ణకాంతితో ప్రకాశిస్తున్న తూర్పు రాజగోపురం



రత్నగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొత్త జనరేటర్లు

- నిరాటంకంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు
- రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు

అన్నవరం: రత్నగిరికి కొత్త కాంతులొస్తున్నాయి.. అధునాతన వెలుగులు ప్రసరించనున్నాయి.. అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ఆధునిక విద్యుత్ పరికరాలు, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌తో నిరాటంకంగా విద్యుత్తు సరఫరా జరుగనుంది. దీనికోసం రూ.1.60 కోట్లతో రెండు జనరేటర్లు అదనంగా ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ నిలిచిపోతే కేవలం 40 సెకన్లలో జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా పవర్ హౌస్‌లను ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ శనివారం 'సాక్షి'కి తెలిపారు. రత్నగిరిపై స్వామివారి ఆలయం, వ్రత మండపాలు, కల్యాణ మండపం, ఇతర కార్యాలయాలకు విద్యుత్ సరఫరాకు అండర్ గ్రౌండ్ కేబుళ్లు వేస్తున్నామని వివరించారు.

రత్నగిరి, సత్యగిరి పవర్ హౌస్‌లలో..

రత్నగిరి, సత్యగిరి, కొండ దిగువన దేవస్థానానికి మూడు పవర్ హౌస్‌లు ఉన్నాయి. ఇందులో రత్నగిరిపై సీఆర్వో ఆఫీస్ పక్కన పవర్‌హౌస్‌లో 250 కేవీ, 500 కేవీ విద్యుత్తు జనరేటర్లు ఉన్నాయి. వీటికి తోడు 380 కేవీ విద్యుత్ జనరేటర్ ఏర్పాటు చేశారు. సత్యగిరి పవర్‌హౌస్‌లో ప్రస్తుతం 320 కేవీ జనరేటర్లు రెండు ఉండగా, అదనంగా 380 కేవీ జనరేటర్ అందుబాటులోకి రానుంది. రత్నగిరి పవర్‌హౌస్‌లో కొత్త జనరేటర్ల ఏర్పాటు శనివారంతో పూర్తయిందని డీఈ తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు దేవస్థానానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే మొదట 250 కేవీ జనరేటర్ ఆన్ అవుతుంది. దాని కెపాసిటీ చాలకపోతే 380 కేవీ, ఆ కెపాసిటీ కూడా చాలకపోతే 500 కేవీ జనరేటర్స్ ఆన్ అవుతాయి.

త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణం

స్వామివారి దేవస్థానానికి మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి రత్నగిరిపై రూ.ఐదు కోట్లతో ఇన్‌డోర్ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సీఆర్వో ఆఫీస్ పక్కన 1,048 గజాల స్థలాన్ని దేవస్థానం సమకూర్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) దీనిని నిర్మిస్తోంది.

సంక్రాంతి నాటికి వెలుగులు



ఈ సంక్రాంతికి రత్నగిరిపై కొత్త వెలుగులు ప్రకాశించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నాం. విద్యుత్ జనరేటర్లు అమర్చే పని పూర్తయ్యింది. అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. న్యూసీసీ సత్రంపై శంఖు, చక్రం, నామం ఏర్పాటు చేసే పనులు చేపట్టాం. రెండు రాజగోపురాలు బంగారు రంగు దీపాల వెలుగులో ప్రకాశించేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. తూర్పు రాజగోపురం మెట్లకు కూడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం.

– సూర్యనారాయణ, దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ

లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం



షాపింగ్ మాల్‌లో పట్టు చీరలను పరిశీలిస్తున్న సినీ తారలు అనసూయ, నేహాశెట్టి

పెద్దాపురంలో సినీతారల సందడి

పెద్దాపురం: స్థానిక దర్గా సెంటర్‌లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో శనివారం సినీ తారలు సందడి చేశారు. అనసూయ (జబర్దస్త్ ఫేమ్), నేహాశెట్టి (డీజేటిల్లు ఫేమ్)ల చేతుల మీదుగా ఈ మాల్ ప్రారంభించారు. తొలుత షాపింగ్ మాల్ అధినేతలు శ్రీను, రత్తయ్య, స్వామి ఆధ్వర్యంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు మాల్‌ను సందర్శించి మాట్లాడారు. లక్కీ షాపింగ్ మాల్ బ్రాంచ్ పెద్దాపురంలో ఏర్పాటు చేయడం పట్టణాభివృద్ధికి శుభసూచికమన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన వస్త్రాలను అందించడం మంచి పరిణామమన్నారు. అనంతరం సినీతారలు అనసూయ, నేహాశెట్టి మాల్ వద్దకు వచ్చేసరికి అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో లక్కీ షాపింగ్ మాల్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అటువంటి నాణ్యత, అద్భుతమైన షాపింగ్ అనుభూతినందించే సువిశాలమైన షోరూమ్ ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని అనసూయ, నేహాశెట్టి అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బిల్డింగ్ యజమాని గోమాడ సూరిబాబు, కంకటాల ఎండీ కంకటాల మల్లిక్, వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు మురళి, కనపర్తి చీమదొర, టీడీపీ నాయకులు బొడ్డు బంగారుబాబు, తూతిక రాజు, నాళం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభిస్తున్న దొరబాబు, మట్టే శ్రీనివాస్

ఆరేళ్లుగా నక్కి.. ఆఖరికి చిక్కి

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన కేసులో ఆరేళ్లుగా పరారీలో ఉన్న రాజమహేంద్రవరం సుబ్బారావునగర్‌కు చెందిన తొండపు నాగప్రసాద్(ప్రసాద్)ను శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం రామన్నపాలేనికి చెందిన పేరుబోయిన శివభవాని (మృతురాలు) 2008లో మొదటిభర్త చనిపోవడంతో కుమార్తెను తీసుకుని బతుకుతెరువు నిమిత్తం రాజమహేంద్రవరం వచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, రోగులకు సేవలందిస్తూ వారిచ్చే డబ్బులతో తన కుమార్తెతో కలసి జీవిస్తుండేది. శివభవానికి కార్ డ్రైవర్ తొండపు నాగప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. నాగప్రసాద్ భార్యకు ఓ ప్రమాదంలో మతిస్థిమితం పోయింది. దీంతో 2014 నుంచి శివభవాని, తన కుమార్తెతో కలసి నాగప్రసాద్ ఇంట్లోనే కాపురం ఉన్నారు. అనంతరం ఆ ఇల్లు అమ్మేయడంతో పక్కనే ఉన్న సంజీవయ్యనగర్‌లో అద్దెకు వెళ్లారు. 2017 మార్చి 2న శివభవాని ఇంట్లో మృతి చెంది ఉంది. మృతురాలి తల్లి పేరుబోయిన కొవ్వాడమ్మ, బంధువులు వచ్చి చూడగా శివభవాని పీకకోసి ఉంది. ముందురోజు తమకు గొడవ జరగడంతో ఆమె పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని నాగప్రసాద్ అందరినీ నమ్మించాడు. దీంతో బంధువులు శివభవాని మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువెళ్లి దహన సంస్కారాలు జరిపించారు. అంత్యక్రియలు పూర్తయిన రెండు వారాల తరువాత మృతురాలి సోదరుడు వెంకటేష్‌కు నాగప్రసాద్ ఫోన్ చేసి మీచెల్లి తనకు తానుగా పీక కోసుకుని ఆత్మహత్య చేసుకోలేదని, తరచూ డబ్బులు కోసం వేధిస్తుందని అందుకే తానే చంపేశానని తెలిపాడు. దీంతో ఈ విషయమై 21 రోజుల అనంతరం మృతురాలి తల్లి కొవ్వాడమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాగప్రసాద్ పరారీలో ఉండగా, ప్రస్తుత త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, సెంట్రల్ జోన్ డీఎస్పీ జేవీ సంతోష్ పర్యవేక్షణలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన త్రీటౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ బీఎంవీవీ భానుమూర్తి, జె.సుబ్బారావు, క్రైమ్ కానిస్టేబుళ్లు కె.వెంకటేశ్వరరావు, బి.విజయకుమార్‌లను సెంట్రల్ జోన్ డీఎస్పీ జేవీ సంతోష్ అభినందించారు.



అరెస్టు చేసిన నిందితుడిని హాజరుపరిచిన ఇన్‌స్పెక్టర్ మధుబాబు

పొట్టకూటికి వచ్చి పరలోకాలకు..

ఇద్దరు మత్స్యకారుల మృతి

కిర్లంపూడి: కాయకష్టం చేసుకుని జీవించే కుటుంబాలు వారికి.. పొట్టకూటి కోసం ఊరుకాని ఊరు వచ్చారు. చెరువు ఊబిలో చిక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బూరుగుపూడి గ్రామంలోని దుశ్లామ్ చెరువులో చేపలు పట్టేందుకు కృష్ణా జిల్లా నుంచి 70 మంది శనివారం వచ్చారు. వీరు చేపలు పట్టేందుకు వలతో సిద్ధమై చెరువులోకి దిగారు. ఇందులో తిప్పగ్రామం (ఉర్లగొంది)కి చెందిన తిరుమారి సత్యనారాయణ (41), బస్వాని సత్యనారాయణ (55) బురదలో కూరుకుపోయారు. వెంటనే సహచరులు గురించి కేకలు వేశారు. అప్పటికే వారు గల్లంతయ్యారు. ఈ విషయమై కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బి.తిరుపతిరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువు అడుగు భాగాన బురదలో కూరుకుపోయిన తిరుమారి సత్యనారాయణ, బి.సత్యనారాయణ మృతదేహాలను వెలికితీశారు. ఇదిలా ఉంటే బస్వాని సత్యనారాయణకు భార్యతో పాటు అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. తిరుమారి సత్యనారాయణకు భార్య, పాప ఉన్నారు. ఈ కుటుంబాలకు వీరే పెద్ద దిక్కు. సంఘటనా స్థలాన్ని సీఐ సూర్యఅప్పారావు పరిశీలించారు.



ఘటనా స్థలంలో మృతదేహాలు